క్లుప్తంగా

కొత్తవలస బస్టాండ్‌లో నూతన బస్‌షెల్టర్



బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు జోగారావు, భాగ్యలక్ష్మి

పార్వతీపురంటౌన్‌: పురపాలక సంఘం పరిధి కొత్తవలస ప్రధాన రహదారిలో గల బస్టాండ్‌ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం లయన్స్‌ క్లబ్‌ సభ్యులు నూతనంగా ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి బుధవారం ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారి, ఇతర సభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

రబీపంటలకు ఈ క్రాప్‌ నమోదు చేయాలి

సీతానగరం: మండలంలో రబీ సాగుచేస్తున్న రైతులు ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులతో ఈ పంటనమోదు చేయించుకోవాలని ఏఓ ఎస్‌.అవినాష్‌ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన మండల వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ రైతులు పొలాల్లో రబీ సాగుచేస్తున్న పంటలపై ఈ పంట నమోదు చేయించుకుంటే విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి పరిహారం వస్తుందని, పంటరుణాలు పొందడానికి ఇదో చక్కని అవకాశమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు ఈ పంటనమోదు చేయించాలని పిలుపునిచ్చారు. గ్రామాలకు వస్తున్న వ్యవసాయ సహాయకులకు ఈ పంట నమోదులో రైతులు సహకరించాలని కోరారు.

ఘనంగా వసంతపంచమి



బలిజిపేట: వెంగళరాయపురం పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని పూజిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బలిజిపేట: వసంతపంచమి సందర్భంగా సరస్వతి దేవికి పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా పూజలు చేశారు. సరస్వతిదేవి జన్మదినం సందర్భంగా వసంతపంచమిని నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలిపారు. అందులో భాగంగా వెంగళరాయపురం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసి భక్తి, శ్రద్ధలతో ప్రార్థించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం పట్టణ పరిశుభ్రతే ధ్యేయం

- మున్సిపల్‌ కమిషనర్‌ సుడిగాలి పర్యటన



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌

పార్వతీపురంటౌన్‌: పార్వతీపురం పట్టణ పరిశుభ్రతే ధ్యేయమని మున్సిపల్‌ కమిషనర్‌ పి.సింహాచలం అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో గల 23 వ వార్డు బోటు వీధిలో పర్యటించారు. ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటూ పారిశుద్ధ్య పనులు జరుగుతున్న ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం బెలగాంలో గల ఎంఆర్‌ఎఫ్‌ సెంటర్‌ను, పార్వతీపురం డంపింగ్‌ యార్డ్‌ను సందర్శించారు. కార్యక్రమంలో శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్‌, ఏఈ పాల్గొన్నారు.

ప్రజారోగ్య భద్రత ప్రభుత్వానిదే..



వైద్యసేవలను పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్‌: ప్రజల ఆరోగ్య భద్రత ప్రభుత్వానిదే అని నగరపంచాయతీ వైస్‌ చైర్మన్‌ పల్లా ప్రతాపరావు, కౌన్సిలర్లు కోడెం సాయికృష్ణ అన్నారు. రామాకళామందిర్‌ సచివాలయం పరిధి కోమటిపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. అర్బన్‌ పీహెచ్‌సీ వైద్యాధికారి రత్నతేజ్‌ నేతృత్వంలో 410 మందికి వైద్య సేవలందించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. సీజనల్‌ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని నగర కమిషనర్‌ ఎస్‌.సర్వేశ్వరరావు పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- గెడ్డలుప్పిలో సచివాలయం ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు, స్థానిక సర్పంచ్‌ తిరుపతిరావు

సీతానగరం: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మండల పరిధిలో గల గెడ్డలుప్పి గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూ.43లక్షల వ్యయంతో ఇటీవల నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి గ్రామపరిధిలో అపూర్వ స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున ప్రజలు మద్దతుగా నిలిచారు.

గ్రామ స్వరాజ్య స్థాపన

సచివాలయం ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ పల్లెలను ప్రగతి పథంలో నడిపేందుకు కంకణం కట్టుకున్న సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి ప్రతి గ్రామంలో ప్రభుత్వ సేవలను పల్లె చెంతకు తెచ్చి గ్రామాలలో సచివాలయం, వలంటీర్‌ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపన కోసం విశేష కృషి చేసిన గొప్ప నాయకుడిగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నాలుగున్నర ఏళ్ల కాలంలో గెడ్డలుప్పి గ్రామంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా నేరుగా ప్రజలకు లబ్ధి చేకూర్చారని, అలాగే గ్రామంలో వందల మీటర్ల సీసీ కాలువలు, రోడ్లుతో పాటు నాడు నేడు ద్వారా పాఠశాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

ఇంటింటికీ కుళాయి నీరు సరఫరా

ఇవన్నీ ఒకెత్తు అయితే గ్రామానికి ముఖద్వారంగా నిలిచే సువర్ణముఖి నదిపై వంతెన నిర్మాణం పూర్తి చేసి గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రామంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగు నీరు సరఫరా చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల సీనియర్‌ నాయకుడు బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, సర్పంచ్‌ అల్లు తిరుపతిరావు, ఎంపీటీసీ కె.సత్యనారాయణ, పీఏసీఎస్‌ చైర్మన్‌ కర్రి శ్రీరాములు, మాజీ సర్పంచ్‌ కె.వెంకయ్య, వైస్‌ ఎంపీపీ టి సూర్యనారాయణ, సర్పంచ్‌ పెంట శ్రీదేవి, శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, ఇంజినీరింగ్‌ అధికారులు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహ సారథులు పాల్గొన్నారు పోల ఈశ్వరణారాయణ, మాజీ జెడ్పీటీసీ అంబటి కృష్ణం నాయుడు, మాజీ సీడీసీ చైర్మన్‌ ఎన్‌.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కిక్‌ బాక్సింగ్‌లో శ్రీకృష్ణ స్కూల్‌ విద్యార్థికి గోల్డ్‌ మెడల్‌



విద్యార్థిని అభినందిస్తున్న శ్రీకృష్ణ స్కూల్‌ కరెస్పాండెంట్‌ అనిల్‌

పార్వతీపురంటౌన్‌: పట్టణంలోని జూనియర్‌ కళాశాల గ్రౌండ్‌లో స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్యే కప్‌ కిక్‌బాక్సింగ్‌ పోటీల్లో స్థానిక శ్రీకృష్ణ స్కూల్‌ 5వ తరగతి విద్యార్థి బి. గణేష్‌ 21కేజీల విభాగంలో గోల్డ్‌ మెడల్‌ గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా స్కూల్‌ కరెస్పాండెంట్‌ అనిల్‌ మాట్లాడుతూ పిల్లలకు ఆటలెంతో మనోవికాసాన్ని ఇస్తాయని, వారు ఆటలు ఆడడంవల్ల శారీరకంగా, మానసికంగా ఒత్తిడిని తట్టుకుంటూ లక్ష్యాన్ని సాధించడంలో పట్టుదలగా ఉంటారన్నారు. ఈ పోటీ ప్రపంచంలో చదువు ఎంత ముఖ్యమో క్రీడలకు కూడా అంతే ప్రాముఖ్యం ఇవ్వాలని హితవు పలికారు. తమ స్కూల్‌ విద్యార్థి ఈ ఘనత సాధించినందుకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్కూల్‌ ప్రిన్సిపాల్‌ గణేష్‌ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పార్లమెంట్‌ నియోజకవర్గ సమన్వయకర్త



ఎమ్మెల్యే జోగారావును కలిసిన అరకు పార్లమెంటరీ కోఆర్డినేటర్‌ కె. భాగ్యలక్ష్మి

పార్వతీపురంటౌన్‌: వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్‌ నియోజకవర్గ సమన్వయకర్త, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఎమ్మెల్యే జోగారావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అరకు పార్లమెంట్‌ నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రకటించిన తర్వాత పార్లమెంట్‌ నియోజకవర్గ పరిధిలోని పర్యటనకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ పరిధిలో పార్టీ పరిస్థితి గురించి ఎమ్మెల్యే జోగారావును అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సహకారంతో నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తను, ప్రజలను కలుస్తానని భాగ్యలక్ష్మి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు

జియ్యమ్మవలస: ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజును వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్‌ నియోజకవర్గ సమన్వయకర్త, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పరీక్షిత్‌రాజు దంపతులకు పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఎంపీ అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పుష్పశ్రీవాణి దంపతులు ఆమెను సత్కరించారు.

సీహెచ్‌డబ్ల్యూలను ఆశా వర్కర్లుగా గుర్తించాలి

సీతంపేట: కమ్యూనిటీ హెల్త్‌ వర్కర్లను ఆశా వర్కర్లుగా గుర్తించి వారికి నెలకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని సీహెచ్‌డబ్ల్యూలు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సీతంపేట ఐటీడీఏ వద్ద బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సామూహిక దీక్షలు చేపట్టారు. కమ్యూనిటీ హెల్త్‌ వర్కర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు కోరారు.

పేద మహిళల సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్‌: పేద మహిళల సొంతింటి కలను సాకారం చేసిన ఏకైక సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు పురపాలక సంఘం పరిధిలో 19వ వార్డుకు చెందిన అక్కా చెల్లెమ్మలకు సీఎం జగన్‌ మోహన్‌ రెడ్డి గతంలో నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా మంజూరు చేసిన ఇంటి స్థలాల పట్టాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ అందరి ఆశను నెరవేర్చిన సీఎం జగన్‌ మరో అడుగు ముందుకేసి మీ పేరిటనే ఇళ్ల స్థలాలు ఉచిత రిజిస్ట్రేషన్‌ కూడా చేయించి వాటిపై పూర్తి హక్కు కల్పిస్తారని తెలిపారు. మీరు అంతా పొందిన మేలును గుర్తు పెట్టుకుని వైఎస్‌ జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ బోను గౌరీశ్వరి, వైస్‌ చైర్మన్‌ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, స్థానిక కౌన్సిలర్‌ తెలుగు బోదయ్య, సచివాలయ కన్వీనర్లు చందాన ఆనంద్‌, ఎస్‌.లలిత, ఎస్‌. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కష్టం విలువ తెలిసిన నాయకుడు జగన్‌



తనీష్‌ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌, తదితరులు

పాలకొండ రూరల్‌: కష్టం విలువ తెలిసిన నాయకుడు సీఎం జగన్‌ అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, శాసన మండలి విప్‌ పాలవలస విక్రాంత్‌ అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం గ్రామానికి చెందిన రణస్థలం ఉదయకుమార్‌, దేవి దంపతుల కుమారుడు తనీష్‌కు ఆరోగ్యం బాగులేకపోవడంతో చిన్నారి వైద్య ఖర్చులకు కోసం సీఎం సహాయ నిధి నుంచి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని బుధవారం చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు.

నియోజకవర్గంలో అనేక మందికి సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అరుకు పార్లమెంట్‌ ఇన్‌చార్జ్‌ జి.భాగ్యలక్ష్మి, ఎంపీపీలు బి.భాను, డి.వెంకటరమణనాయుడు, వైస్‌ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్‌, వాకముడి అనీల్‌కుమార్‌, రణస్థలం రాంబాబు, బంకి లక్ష్మణమూర్తి, పాలవలస ధవళేశ్వరరావు, తదితరులున్నారు.

శంఖారావం కాదు.. శునకారావం

- లోకేష్‌ ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా
- మండిపడ్డ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్‌:

టీడీపీ నాయకుడు నారా లోకేష్‌ పార్వతీపురం పట్టణ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమం శంఖారావం కాదని అది శునకారావం అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014–2019 సంవత్సరంలో అధికారంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, లోకేష్‌ పంచాయతీరాజ్‌ శాఖామంత్రిగా ఉన్నారు. అప్పుడు పార్వతీపురం నియోజకవర్గానికి వారు చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు. స్కిల్‌ స్కాంలో రూ. 371 కోట్ల అక్రమాలు జరిగనట్లు తేలడంతో కేంద్ర నిఘా వర్గాలు చంద్రబాబునాను అరెస్టు చేశాయని, ఈ కేసులో నారా లోకేష్‌ తప్పించుకుని వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యేలపై అవినీతి మరకలు అంటించడం సమంజసమా? అని ప్రశ్నించారు.

అవినీతి చేసింది మీరు కాదా?

స్కిల్‌ స్కామ్‌లో చంద్రబాబునాయుడు, లోకేష్‌ దొంగలుగా నిర్ధారణ అయ్యిందని, పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ బోనెల విజయచంద్ర ఎంఈఎఫ్‌, ఇంటలెక్చువల్‌ ఫాం సంస్థ ద్వారా కొన్ని కోట్ల రూపాయలు అక్రమాలు చేసినట్లు స్వయాన ఆ సంస్థవారు వచ్చి పార్వతీపురం పట్టణంలో చేసిన ఆరోపణ నిజం కాదా? అని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్‌ పార్వతీపురం మున్సిపాల్టీలో చేసిన అవినీతి మరిచిపోయారా..? కొమరాడ మండలం, గరుగుబిల్లి మండలంలో జగదీష్‌ చేసిన అక్రమాలు మరిచిపోయారా.. ? మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు టీటీడీ లెటర్లను అమ్ముకోలేదా అంటూ మండిపడ్డారు.

'సూపర్‌సిక్స్‌ ఎలా అమలు చేస్తారు...

జగనన్న ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తే రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుందని, రాష్ట్రం మరో వెనిజులా లాగా మారుతుందని చెబుతున్నారు. మరి మీరు ప్రచారం చేస్తున్న సూపర్‌ సిక్స్‌ పథకాల ద్వారా సంవత్సరానికి రూ.76వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. సంవత్సరానికి రూ.76వేల కోట్ల ఎలా సృష్టిస్తారు..? సంపద సృష్టిస్తామని హామీలిస్తున్నారు కదా. ఏ విధంగా సృష్టిస్తారో ప్రజానీకానికి చెప్పాల్సిన బాధ్యత మీపై ఉందని మండిపడ్డారు.

ఎవరికి ష్యూరిటీ..ఎవరికి గ్యారంటీ..?

నారా లోకేష్‌ అనే మాలోకానికి బాబు ష్యూరిటీ ఇస్తాడు. ఆ మాలోకానికే గ్యారంటీ లేనప్పుడు ప్రజలకు చంద్రబాబు, లోకేష్‌లు ఏ గ్యారంటీ ఇస్తారు. బడుగు, బలహీన వర్గాలకు, రైతులకు, డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు, నేత, గీత, కార్మికులకు గత 14ఏళ్లలో ఇవ్వని ష్యూరిటీ ఇప్పుడు ఇస్తానంటే నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. మంగళగిరిలో లోకేష్‌ గెలుస్తాడన్న గ్యారంటీ చంద్రబాబు ఇవ్వగలడా? అని ఎమ్మెల్యే జోగారావు ఎద్దేవా చేశారు.

పశువిజ్ఞాన బడులను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఏ.డి డాక్టర్‌ సీహెచ్‌ దీనకుమార్‌

సీతానగరం: పశువైద్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువిజ్ఞాన బడులను రైతులు వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏ.డి సీహెచ్‌ దీనకుమార్‌ కోరారు. ఈ మేరకు బుధవారం సీతానగరం మండలంలోని బగ్గందొరవలస పశువైద్య కేంద్రాన్ని తనిఖీచేసిన అనంతరం గ్రామంలోని పాడిరైతులు, గొర్రెలు, మేకలపెంపకం దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధులు ఆశించే ముందు చేయాల్సిన ప్రథమ చికిత్స విషయాలపై వైద్యాధికారులతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా పాడి పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులు అవగాహన కల్పించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్‌లు, గ్రామవలంటీర్లు, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు, గొర్రెలపెంపకం దారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



అగ్నిప్రమాదాల నివారణపై వివరిస్తున్న అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు అన్నారు. ఈ మేరకు అగ్నిప్రమాదాల నివారణపై బుధవారం ఆయన పట్టణంలోని వైటీసీలో గల గిరిశిఖరగర్భిణుల వసతిగృహంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్‌, విద్యుత్‌ తదితర కారణాలతో అగ్నిప్రమాదాలు ఏ విధంగా సంభవిస్తాయి? వాటిని ఎలా నివారించాలనే అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంపొందించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌ పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

పార్వతీపురంటౌన్‌: పార్వతీపురం మున్సిపల్‌ పరిధిలో గల కేఎస్‌ఎం, బైపాస్‌ కాలనీ మున్సిపల్‌ పాఠశాలలను ఎంఈఓ 1 సామల సింహాచలం(ఎఫ్‌ఏసీ) బుధవారం సందర్శించారు. టీచర్ల డైరీలను, లెసన్‌ ప్లాన్‌ను తనిఖీ చేశారు. వర్క్‌బుక్స్‌ పరిశీలించి, చేతిరాత బాగా ఉండేందుకు విద్యార్థులకు మెలకువలు తెలియజేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి, పలుప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని, విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి మాట్లాడండి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

- లోకేష్‌పై విరుచుకుపడిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: కురుపాం నియోజకవర్గంలో టీడీపీ నిర్వహించిన శంఖారావం సభలో నారా లోకేష్‌ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఎద్దేవా చేశారు. చినమేరంగిలోని తన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఏ కార్యక్రమం నిర్వహిస్తున్నామో కూడా లోకేష్‌కు తెలిసినట్లు లేదని, ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదివి అబాసు పాలయ్యారని అన్నారు. లోకేష్‌ మాట్లాడిన ప్రతీ మాటలో వాస్తవం లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని, రాష్ట్రమంతా లబ్ధిదారులు సంబరాలు చేసుకుంటుంటే.. లోకేష్‌కు అవేవీ పట్టనట్లుందన్నారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మాత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదు జమ అవుతోందన్నారు. ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పి నిరుద్యోగ యువతను మోసం చేసిన ఘనత టీడీపీదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు 1.30 లక్షల మందికి గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించామని, 1998, 2008 డీఎస్సీ క్వాలిఫైడ్‌ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చామని, ప్రస్తుతం 6100 ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్‌ జారీ చేయడం జరిగిందన్నారు. ఇవి కాక ఆరోగ్యశాఖలో వేలాది పోస్టులు భర్తీ చేసినట్లు చెప్పారు. ఐదేళ్ల పాలనలో చంద్రబాబు ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా అని నిలదీశారు. నాపైన, నాభర్త పరీక్షిత్‌రాజు, నామరిది రమేష్‌బాబుపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని లోకేష్‌కు హితవు పలికారు. ఆమెతో పాటు ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లె సుజాత, మొండెఖల్లు ఎంపీటీసీ విద్యారాణి, డీసీసీబీ డైరెక్టర్‌ లోలుగు నారాయణరావు, నాయకులు అంధవరపు కోటేశ్వరరావు ఉన్నారు.

సకాలంలో లక్ష్యాలు పూర్తిచేయాలి

పాలకొండ రూరల్‌:

ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన పన్ను బకాయిలు సకాలంలో వసూలు అయ్యేలా సచివాలయ యంత్రాంగం దృష్టి సారించాలని నగరపంచాయతీ మేనేజర్‌ టి.జయరామ్‌ అన్నారు. పట్టణంలోని సచివాలయాలను ఆర్‌ఐ కె.గజపతిరావుతో కలిసి బుధవారం సందర్శించారు. ఆయా సచివాయాల పరిధిలో రావాల్సిన ఇంటి, ఆస్తి పన్నుల వివరాలు, రికార్డులు పరిశీలించారు. వలంటీర్లతో సమన్వయం చేసుకొని నిర్ణీత గడువులోగా బకాయిలు వసూలు చేయాలని సూచించారు. సచివాయాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల తాజా స్థితిగతులను అడ్మిన్‌ సెక్రటరీలను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఏపీజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్‌ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్‌ వరహాలుకు వినతిపత్రం అందజేశారు.